# రేపటి ఆశ

బయ్...బయ్...మంటూ సైరన్ మోగుతూ పోలీస్ కారు వచ్చి ఇంటి ముందు ఆగింది. కార్లోంచి పోలీస్ ఆఫీసర్ దిగి బెల్ కొట్టాడు. సైరన్ శబ్దం, ఇంటి ముందు పోలీస్ కారాగడం, బెల్ విని తలుపు తీసిన అన్నపూర్ణ పోలీసుని బిత్తరపోయి చూసింది. "వాట్ హేపెన్డ్. వై డిడ్యూ కాల్ ది పోలీస్". ఇంట్లోకి చూస్తూ అనుమానంగా అడిగాడు. అన్నపూర్ణకి వచ్చిందే అంతంత మాత్రం ఇంగ్లీషు. దానికి తోడు అమెరికన్ ఏక్సెంట్. తెల్లబోతూ బిక్కమొహం వేసింది. ఆవిడ ఏదో చెప్పబోయే లోపలే వెనుక నుంచి ఏడేళ్ల కిరణ్ వచ్చి, "ఐ కాల్డ్ యూ ఆఫీసర్" అన్నాడు. "వై, వాట్ హేపెన్డ్?" ఆఫీసర్ ఆశ్చర్యంగా ప్రశ్నించాడు. "మా గ్రాండ్ మదర్ నన్ను కొట్టింది. చైల్డ్ అబ్యూజ్... సో ఐ కాల్డ్ యూ". మామ్మ వంక శాస్తి చేశాను చూశావా అన్నట్టు వాడి కళ్ళలో చిలిపితనం. మనుమడు అమెరికన్ ఇంగ్లీష్‌లో చెప్పింది అంతా అర్థం కాకపోయినా, 'చైల్డ్ అబ్యూజ్' అన్న పదం విని ఉంది కనుక అది అర్థం అయి బిత్తరపోతూ కంగారుగా ఆఫీసర్ వంక చూసింది. తనకొచ్చిన ఇంగ్లీషులో ఏదో చెప్పబోయింది. ఆమెకి భాష రాదని అర్థం అయి, "మీ పేరెంట్స్ ఎక్కడ? అన్నాడు. ఆఫీస్ నంబర్లు అడిగి మొబైల్లో కాంటాక్ట్ చేశాడు.

పదిహేను నిమిషాల్లో అరవింద, కల్యాణ్ చెరో కార్లో ఆగమేఘాల మీద వచ్చినట్టు వచ్చి వాలారు. ఆఫీసర్ జరిగింది చెప్పగానే ఇద్దరికిద్దరూ తెల్లబోతూ కిరణ్ వంక చూశారు. కల్యాణ్ కోపంగా "కిరణ్, వాటీజ్ దిస్, మామ్మ నీవల్లరి చేస్తే ఓ దెబ్బ వేస్తే కంప్లయింట్ చేస్తావా?" అన్నాడు.

"నన్నెందుకు కొట్టాలి మరి?" పొగరుగా తలెగరేసి అన్నాడు.

"సారీ ఫర్ ది ట్రబుల్ ఆఫీసర్. ఈవిడ మా అమ్మగారే. మా ఇంట్లోనే ఉంటారు. వీడు చాలా అల్లరిచేస్తాడు. అది భరించలేక చిన్న దెబ్బ వేసి ఉంటుందావిడ" పరిస్థితిని వివరించసాగాడు కల్యాణ్. ఆఫీసర్ అన్నపూర్ణ వంక చూశాడు. ఆవిడకిదంతా తల కొట్టేసినట్లనిపించింది.

"నాయనా కల్యాణ్, నేనేం అనలేదురా. అన్నం తినకుండా అల్లరి పెడుతుంటే బలంతాన నోట్లో పెట్టాను. తువుక్కున నా మొహం మీద ఉమ్మాడు" చూడు ఇల్లంతా

ఎలా మెతుకులో . కోపం వచ్చి వీపుమీద ఒకటేశానురా. అంతే". ఆవిడకి పాపం కంట్లో నీరు తిరిగింది. పోలీసులు, కొడుకూ కోడలు ముందు దోషిలా నిలబడాల్సి వచ్చినందుకు తల కొట్టేసినట్టుంది.

'సార్, మా ఇండియాలో పిల్లలు అల్లరి చేస్తే ఓ దెబ్బ వేయడం చాలా మామూలు. ఆవిడని విసిగిస్తే చిన్న దెబ్బ వేసింది. ఆవిడకి ఇక్కడి పద్ధతులు తెలియవు. వీడు ఏదో కోపంలో మీకు కంప్లయింట్ ఇచ్చాడు. సారీ ఫర్ ది ట్రబుల్...' కళ్యాణ్ విడమరిచి చెప్పాడు. అన్నపూర్ణమ్మ నల్లబడ్డ ముఖం చూసి ఆఫీసర్‌కి అర్థమయింది. ఇది కుర్రాడి అల్లరి పని అని.... "ఒకే. హేయ్ బాయ్, డోన్ట్ ఏక్ట్ ఫన్నీ, యు విల్ బి ఇన్ ట్రబుల్ నెక్స్ట్ టైమ్, ఇఫ్ యు బిహేవ్ లైక్ దిస్." వార్నింగ్ ఇస్తున్నట్టు అని వెళ్ళిపోయాడు. తల కొట్టేసినట్టయింది అన్నపూర్ణకి. కొడుకు ముఖం వంక చూడలేకపోయింది.

"అత్తయ్యా నేను మీకు చెప్పాను గదా. వాడిని కదిలించొద్దని. ఇక్కడి పిల్లల సంగతి మీకు తెలియదు. మన దేశంలో మాదిరి కొడితే ఊరుకోరు. ఛైల్డ్ ఎబ్యూజ్ నేరం ఇక్కడ" అంది అరవింద. అన్నపూర్ణకి ఆవేశం వచ్చింది. 'వేలెడంత వెధవ. వాడికి అందరూ భయపడవేమిటి? నాలుగంటించితే నోరు మూసుకుని ఉంటాడు. వాడినేమీ అనకుండా తనకు నీతులు చెపుతుందేమిటి?'

"నీవేమో ఎలాగో అలా వాడికి అన్నం పెట్టమంటావు. బతిమలాడినా వినడు, కసిరినా వినడు. బలవంతాన పెడితే నా మొహం మీద ఉమ్మితే కోపం రాదు. ఇల్లూ వాకిలీ ఎలా విరజిమ్మాడో చూస్తున్నావుగా. వీపు మీద ఓ దెబ్బ ఇలా వేశానంతే. కొరకొర చూస్తూ ఉక్రోషంగా గదిలోకి వెళ్ళాడు. ఇలా ఫోన్ చేస్తాడని నాకేం తెలుసు. అయినా, ఇదెక్కడి ఘోరం. పిల్లలు అల్లరి చేస్తే ఓ దెబ్బ వేయడం నేరమేమిటి?' ఉక్రోషంగా అంది అన్నపూర్ణ. "మీరంతా ఇలా మరీ నెత్తికెక్కించుకుంటుంటే తొక్కకేం చేస్తారు" అని అనకుండా ఉండలేకపోయింది.

"కిరణ్ ఎందుకలా చేశావు?" కళ్యాణ్ కోపంగా కొడుకు వంక చూసి అన్నాడు. చెయ్యి పట్టి లాగి ఎదుట నిలబెట్టాడు. "ఊఁ టెల్ మి ది ఆన్సర్" అన్నాడు. కిరణ్ కాస్త గిల్టీగా చూసి అంతలోనే పొగరుగా తల ఎరేశాడు. "మామ్మ ఎందుకు కొట్టాలి నన్ను?" ఎదురు తిరిగి ప్రశ్నించాడు. "మామ్మ పెద్దది. అల్లరి చేస్తే ప్రాణం విసిగి కొట్టింది. మామ్మంటే ఎవరనుకున్నావు. మై మదర్. నేను చిన్నప్పుడు అల్లరి చేస్తే నన్ను ఎంత కొట్టేదో తెలుసా. నేనెప్పుడూ ఫీలవలేదే ఇలా"

"ఈజిట్-సో, మామ్మ ఈజ్‌రియల్లీ బాడ్". తాను చేసింది తప్పు కాదన్నట్టు

సమర్థించుకోవడానికి కారణం దొరికిందనిపించి రెట్టిస్తూ అన్నాడు.

"మామ్మ మంచిది. నీకోసం, నన్ను చూడడం కోసం ఇక్కడుంటోంది తెలుసా. తాను ఇండియా వెళ్ళిపోతానన్నా నీవు ఒంటరిగా ఉంటావని, నీకు కాలక్షేపం ఉండాలని, నీకు కథలు చెప్తుందని ఉంచేశాం. అలాంటి మామ్మతో నీవు ఇలా ప్రవర్తించడం బాగోలేదు. రియల్లీ అయామ్ హర్ట్." కొడుకుని కూర్చోపెట్టుకుని నచ్చజెప్తున్న కళ్యాణ్ వంక కాస్త ఆశ్చర్యంగానే చూసింది అన్నపూర్ణ. నిజంగా వీళ్ళకి చాలానే శాంతం. అదే తమ దేశంలో అయితే ఇలాంటి వెధవ పని చేసిన పిల్లాడిని పట్టుకు బాధేవారు. వీళ్ళ శాంతాన్ని మెచ్చుకోవాలో, పిల్లాడు ఆడించినట్టల్లా తల్లిదండ్రులు ఆడడం చూసి బాధపడాలో, ఇలాంటి పిచ్చి రూల్స్ పెట్టి పిల్లలకి భయభక్తులు లేకుండా చేస్తున్న ఈ దేశాన్ని అనాలో ఆవిడకి అర్థం కాలేదు. కిరణ్ మాట్లాడలేదు.

"మా చిన్నప్పుడు అల్లరి చేస్తే, పెట్టింది తినకపోతే, చదవకపోతే, బట్టలు పాడుచేసుకుంటే ఇలా అన్నిటికీ కొట్టేవారు. మా డాడీ అంటే మాకెంత భయమో! ఆయన కంట పడకుండా తప్పించుకునేవారం. ఓసారి ఏం జరిగిందో తెలుసా! పరీక్షల్లో మార్కులు సరిగా రాలేదు. ప్రోగ్రెస్ కార్డు చూపిస్తే నాన్న తిడ్తారని నేనే నాన్న సంతకంలా కష్టపడి రాసేను. మాస్టరు అది పట్టేశారు. నాన్నకి లెటర్ రాసి పంపించారు. ఆ రోజు నాన్న బెల్టుపెట్టి కొట్టారు. ఇలా చేయిమీద, వీపుమీద వాతలు పడ్డాయి తెలుసా!' కిరణ్ కళ్ళు పెద్దవి చేసి నమ్మలేని విషయంలా చూసి, "హౌ బార్బారిక్" అన్నాడు తిరస్కారంగా.

"అలా భయం ఉండబట్టే శ్రద్ధగా చదువుకుని పైకి వచ్చాం అనుకుంటాను నేను. అంచేత ఇండియాలో పిల్లలు తప్పు చేస్తే కొట్టడం మామూలు... " కిరణ్‌కి అర్థం అవాలని చెప్పసాగాడు కళ్యాణ్.

"బట్, దిసీజ్ నాట్ ఇండియా. "కూల్‌గా అన్నాడు కిరణ్. కళ్యాణ్ నిస్సహాయంగా చూశాడు ఎలా చెప్పాలో తెలియక.

"కిరణ్ ఇలా రా. మీరు ఉండండి. నేను చెపుతాలెండి వాడికి". అరవింద కొడుకు చేయి పట్టుకుని లోపలకు తీసుకు వెళ్ళింది.

"అయినా, ఇదే పాడు దేశంరా. పిల్లల్ని తిట్టకూడదు. కొట్టకూడదు అని రూల్సేమిటి? ఊరికే ఎవరన్నా కొడతారా. ఇలా రూల్సు పెడితే పిల్లలు అసలు లొంగుతారా. అయినా, వీడికి ఇవన్నీ ఎలా తెలుసురా?"

"తెలియడానికి ఏముంది. ఈ టీవీలు వచ్చి-పిల్లలకి తెలియనివేం ఉన్నాయి. దానికి తోడు పిల్లలు స్కూల్లో మాట్లాడుకుంటారు. అమ్మా, ఈ కాలం పిల్లలు మా

టైములోలా కాదు. వాళ్ళకి అన్ని విషయాలూ తెలుసు. బోలెడు జనరల్ నాలెడ్జ్. వీడు ఈ కిరణ్ నాలుగేళ్ళ కల్లా ఏ కారు చూసినా పేరు చెప్పేసేవాడు. అమెరికా ప్రెసిడెంట్, అమెరికాలో ఊరి పేర్లు అన్నీ చెప్పేవాడు జ్ఞాపకం లేదూ. నీవు చిన్నప్పుడు చెప్పే పద్యాలన్నీ ఎంత గుర్తుపెట్టుకునేవాడు. ఈ కాలం పిల్లలు తెలివి మీరారమ్మా".

"ఏం తెలివితేటలో. ఇలాంటి అతి తెలివితేటలు మంచికంటే చెడెక్కువ చేస్తాయేమో. పిల్లలు పిల్లల్లా ఉండాలి. అల్లరి చేయడం వాళ్ళ సహజ లక్షణం అయినట్లే, మందలించడం పెద్దల బాధ్యతగా ఉండాలి. గానీ, అల్లరి చేసే హక్కు మాత్రం వాళ్ళకిచ్చి, దండించే హక్కు నుంచి మనల్ని దూరం చేయడం వల్ల హాని జరిగేది పిల్లలకే కాదురా. దీనివల్ల వాళ్ళాడింది ఆట, పాడింది పాట అయి విచ్చలవిడితనం పెరిగి విశృంఖలంగా తయారైతే బాధపడాల్సింది పెద్దలే గదా. అన్నపూర్ణ ఆవేదనగా అంది. అంగీకరిస్తున్నట్టు తల ఆడించాడు కల్యాణ్.

"అమ్మా ఈ రోజుల్లో పిల్లల్ని పెంచడం కష్టం అయిపోతోందమ్మా, అందులో ఈ విదేశాలలో. వాళ్ళ ప్రశ్నలకి ఓపికగా జవాబులు చెప్పాలి. వాళ్ళ సందేహాలను విసుక్కోకుండా తీర్చాలి. వాళ్ళ కోరికలను కాదనకూడదు. కాదన్నా శాంతంగా కూర్చోబెట్టి నచ్చజెప్పి ఒప్పించాలి. తినడానికి, చదివించడానికి అన్నింటికీ వాళ్ళతో ఓపిగ్గా కూర్చుని చెయ్యాలి. ఒక్క పిల్లనో, పిల్లాడినో పెంచడానికి తాతలు దిగి వస్తున్నారు".

"అదే అసలు చేటు. ఇలా ఒకర్ని కని ఊరుకోవడంతో ముద్దెక్కువై, అడిగిందల్లా కొనిస్తూ వాళ్ళాడించినట్టు ఆడుతుంటే నెత్తినెక్కుతున్నారు పిల్లలు. మా కాలంలో అరడజను మంది ఉంటే పిల్లలంతా కలిసి ఆడేవారు. పెరట్లో చెట్లెక్కి బొమ్మల పెళ్ళిళ్ళు చేసుకుని, కోతి కొమ్మచ్చులు, దాగుడుమూతలు- ఇలా ఆడుకుంటూ వాళ్ళలో వాళ్ళు కొట్టుకుంటూ, కలిసిపోతూ బాల్యం అంతా గడిపేవారు. అలా అరడజను మందిని కనకలేకపోయినా కనీసం ఇద్దరేనా లేకపోతే వాళ్ళకి ఏం తోస్తుంది! తల్లీ తండ్రీ ఉద్యోగాల పేరుతో రోజంతా ఉండరు. ఈ పిల్లలు ఎంతసేపూ టీవీలు, కంప్యూటర్ గేములు ఆడుకుంటూ అక్కరలేని విషయాలన్నీ నేర్చుకుని ఆరిందాల్లా తయారై వయసుని మించిన మాటలు, చేష్టలతో బాల్యం బాల్యంగా అమాయకంగా గడపడం తగ్గిపోతోంది. ఇవాళ వీడు చేసిన పని ఓ ఏడేళ్ళ కుర్రాడు చేయగలడా మన దేశంలో? కాస్త మందలిస్తే, ఓ దెబ్బ వేస్తే పోలీసులని పిలవడం అంటే మామూలు విషయం కాదురా. పిల్లల్ని కనాలి. పెంచాలి. వాళ్ళకోసం ఖర్చుపెట్టాలిగానీ వాళ్ళనేమీ అనే హక్కు లేదనడం ఈ ప్రభుత్వం చేస్తున్న తప్పు. ఇలాంటి రూల్సేమిటి అసలు!" అన్నపూర్ణ తన అసంతృప్తి వెళ్ళగక్కింది. తల్లి మాటలకి అంగీకరిస్తున్నట్టే తల ఆడించాడు కల్యాణ్.

"కానీ అమ్మా, ఒక విషయం మనం మర్చిపోతున్నాం. ఇక్కడ విడాకులు అతి మామూలు. తల్లిదండ్రులు వేరే వేరే పెళ్ళిళ్ళు చేసుకోవడం చాలా మామూలు. అలాంటప్పుడు సవతి తల్లి, సవతి తండ్రి పిల్లల్ని నిర్లక్ష్యం చేయడం, పిల్లలని తన బిడ్డ కాదన్న అక్కసుతో మానసికంగా హింసించడం పరిపాటి. శారీరకంగా హింసించేవారూ ఉండవచ్చు. అలాంటి కేసులు చూసే బహుశా అందుకే ప్రభుత్వం పిల్లలని మానసికంగా, శారీరకంగా హింసించడం నేరం, ఛైల్డ్ అబ్యూజ్ నేరం అన్నారేమో!" సాలోచనగా అన్నాడు.

అన్నపూర్ణ కాస్త అపనమ్మకంగా, ఆశ్చర్యంగా చూసింది. "అలా అంటావా, ఏమో బాబూ మనకివన్నీ కొత్త. ఇప్పటి వరకు మనకు ఇలాంటి సమస్యలు రాలేదు. కొట్టుకున్నా, తిట్టుకున్నా భార్యాభర్తా పిల్లలకోసం కలిసి బతుకుతున్నారు. అక్కడక్కడా డైవోర్సులు తీసుకున్నా, పిల్లలకే కష్టం లేకుండా తల్లీ తండ్రీ చూసుకుంటున్నారు. మన పిల్లలు అదృష్టవంతులు.

"వస్తాయామ్మా, ఆ రోజులు మనకూ రావచ్చు. విదేశాల కంటే పాతిక ముప్పై ఏళ్ళు మనం వెనుకబడే ఉంటాం అన్నింట్లో. రానున్న తరాలలో ఏం జరగబోతోందో"

అన్నపూర్ణ చేతులెత్తి కనపడని దేవుడికి నమస్కరించి, "ఏదో దేవుడి దయ వల్ల మా తరం ఈ కలికాలం రీతులు చూడంలే. మాతరం దాటిపోతుంది అందతే చాలు" అంది లోపలికి వెడుతూ.

* * *

"మామ్మా స్టోరీ చెప్పు". స్కూలు నుంచి రాగానే అన్నం ముందు కూర్చుని అలవాటుగా అన్నాడు కిరణ్. అన్నపూర్ణ మాట్లాడలేదు. తనకు కోపం వచ్చిందని వాడికి తెలియాలి. నిన్న తాను చేసింది తప్పు. అని వాడికి తెలియచెప్పాలని ఆవిడ తాపత్రయం. కిరణ్ మాట విననట్టు అటు చూడలేదు. జవాబివ్వలేదు. రోజులా అన్నం తిను అనలేదు. "ఏయ్ మామ్మా. చెప్పు" అన్నాడు మళ్ళీ.

నీవు నాతో మాట్లాడకు. నన్నేం కథలు అడగొద్దు. నేను నీతో మాట్లాడను" అంది కోపం నటిస్తూ. కిరణ్ కాస్త ఆశ్చర్యంగా చూశాడు. అప్పుడే వాడి కళ్ళల్లో కోపం తొంగి చూడసాగింది. మొహం ఎర్రపరుచుకున్నాడు. ఏదో అనేలోపలే అన్నపూర్ణ అదనుచూసి, "నీ ఇష్టం వచ్చినట్లు నీవు ప్రవర్తిస్తే నాకేం అవసరం లేదు. నీకు అన్ని సేవలే చేస్తూ కథలు చెప్పడానికి నాకేం పట్టింది. తింటే తిను లేకపోతే మాను. నన్నేంకథలు అడక్కు పోలీసులకి ఫోను చేయి వెళ్ళి, మా మామ్మ ఇలా అందని మళ్ళీ' ఆవిడ మాట పూర్తి కాలేదు. టేబుల్‌మీద ప్లేటు విసురుగా తోసేశాడు కిరణ్. ప్లేటు భళ్ళున బద్దలై ఇల్లంతా

మెతుకులు. కుర్చీకింద పడేటట్టు తోసి లేచి, "అయితే, నీవెందుకిక్కడ? గో బ్యాక్ టు ఇండియా, గో ఎవే" గట్టిగా అరిచి తన గదిలోకి వెళ్ళి తలుపు మూసుకున్నాడు. అన్నపూర్ణ నిర్ఘాంతపోయింది వాడి ధోరణికి. 'సారీ మామ్మా అంటాడు, వెనక నించి వచ్చి వాటేసుకుని, 'సారీ సారీ' అంటాడేమో, అప్పుడు కూర్చోపెట్టి నిన్న జరిగిందానికి తన ఫీలింగ్స్ చెప్పాలనుకుంది. అలాంటి పనులు ఇకముందు చేసి పెద్దవాళ్ళని బాధపెట్టకూడదు. నువ్వు ఇంకా చిన్న పిల్లాడివి కావు అని కూర్చోబెట్టి చెప్పాలనుకుంది. అన్నపూర్ణ మొం మాడిపోయింది. నిన్న పోలీసులని పిలిచిన దానికంటె అవమానం అనిపించింది. ఇండియా వెళ్ళిపొమ్మంటున్నాడు. అంటే వాడు చెప్పినట్టు ఆడకపోతే తనని పొమ్మనే అధికారం వాడికుందని వాడనుకుంటున్నాడా!

చిన్న పిల్లలా ఉక్రోషపడింది. మూడో నెల పిల్లాడి నుంచి సాకింది. వాడి నేపీలు మార్చి పాలుపట్టి, నిద్రపుచ్చి అర క్షణం విశ్రాంతి లేకుండా పెంచింది. చిన్నప్పుడు పెంచడం కంటే వాడికి నడక వచ్చిందగ్గర నుంచి ఇది లాగి అది పీకేవాడిని ఒక్క క్షణం నడుం వాల్చడానికేనా లేకుండా, సావకాశంగా తిండి కూడా తినకుండా వాడి వెంట ఉండి వాడికి ఇది తినిపస్తూ, అది తాగిస్తూ రోజంతా వాడి ఆలనా పాలనతో పాటు ఇంట్లో చాకిరీ, పెద్దవుతున్నకొద్దీ వాడి అల్లరి, ఆగడం, దూకుడు తనం, మొండితనం అన్నీ భరిస్తూ, బతిమాలుతూ, మందలిస్తూ పెంచుకొచ్చింది. ఈ దేశం గాలీ, తిండివల్లో వాడు మూడేళ్లవాడు అయిదారేళ్ళవాడిగా, ఏడేళ్ళవాడు పదేళ్ళవాడిలా బలంగా, ఏపుగా పెరిగి తన భుజాల దాకా వచ్చేశాడు. ఏళ్ళతోపాటు అల్లరి, మంకుతనం పెరిగి ఎన్ని విధాలా ఇంట్లో కాల్చుకుతింటున్నాడో పడుతున్న తనకు తెలుసు.

మనుమడి అల్లరి గురించి కొడుక్కి, కోడలుకి చెపితే ఏమనుకుంటారోనని భయం. అక్కడికీ మరీ అల్లరి భరించలేనప్పుడు చెపితే కోడలు మొహం ముడుచుకునేది. వాళ్ళ ఒక్కగా నొక్క కొడుకుని ఏదో తాను అనేసినట్టు ఆవిడ మొహం మాడ్చుకునేది. పడేదానికి తనకు తెలుసు. సాయంత్రం వచ్చి ఓ గంట కొడుకు ముద్దూ మురిపాలు వినేవాళ్ళకేం తెలుస్తుంది తన పాట్లు. ఎన్నిసార్లు ఇండియా వెళతానన్నా కొడుకు వెళ్ళనీయడు. అక్కడేముందమ్మా అంటాడు, ఎవరున్నారంటాడు. నీకోసం డిష్ పెట్టించాను తెలుగు ఛానల్స్ చూస్తావని. నీ కోసం పుస్తకాలకు చందాలు కట్టానంటాడు. పిల్లాడికి నీవున్నావని గదమ్మా నిశ్చింతగా ఆఫీసుకెడుతున్నాం అంటాడు. మొదట్లో పిచ్చెక్కినట్లుండేది. మాట్లాడేందుకు మనిషి లేక, పిల్లాడి చాకిరీ చేయలేక, చలితట్టుకోలేక ఎప్పుడెళ్ళి తన ఊర్లో వాలుదామా అని ఉండేది. కొడుకు ఎప్పటికప్పుడు వెళ్ళనీయక పోవడంతో ఇప్పుడు అలవాటయింది.

ఏదో తెలుగు టీవీ, తెలుగు పుస్తకాలు, ఎప్పుడన్నా వాళ్ళ తెలుగు ఫ్రెండ్స్ వచ్చినప్పుడు మాటలు... అలా ఈ జీవితం అలవాటయిపోయింది. ఇంత చేసిన తనని వేలెడులేని వెధవ వెళ్ళిపో అనడం ఆవిడకి ఉక్రోషం తెప్పించింది. కాస్త ఆవేశం తగ్గాక 'వాడి మొహం పిల్లవెధవ వాడితో తనకేమిటి' అనిపించి సర్దుకుంది. కానీ, ఆలోచిస్తుంటే వీడి ధోరణి పెడతోవ పడుతోంది. మొక్కై వంగనిది మానై వంగదు. కొడుకుతో గట్టిగా చెప్పాలి. దారికి తెచ్చుకోమని అనుకుంది.

"నాయనా కల్యాణ్. నన్నన్నాడని కాదు. వాడికి బొత్తిగా భయం భక్తీ, పెద్దా చిన్నా గౌరవం అదీ లేకుండా పోతోంది. అని నా భయం. కాస్త ఇప్పుడే వాడిని వంచాలి. తరువాత లొంగడు. నయానో, భయానో వాణ్ణి దారికి తెచ్చుకోవాలి. పిల్లాడని ఊరుకుంటే ఏడేళ్ళకే వాడు ఎందుకూ పనికిరాకుండా పోగలడు. చెప్పుచేతల్లోంచి జారిపోయాక అనుకునేందుకేం మిగలదు. వాడికోపం, దూకుడు, ఏది పడితే అదనడం, చెయ్యడం లాంటివి ఎలా మానిపిస్తావో ఆలోచించు" అంది రాత్రి కొడుకుతో. కోడలు కాస్త మొహం ముడుచుకుంది.

"ఆఁ ఇంకో రెండేళ్ళు పోతే ఆ అల్లరి తగ్గుతుంది. చదువులో పడితే టైముండదు" సమర్థించబోయింది అరవింద. కల్యాణ్ సాలోచనగా తల అడ్డంగా ఆడించాడు. "నో అరవిందా. అమ్మా చెప్పినట్టు మొక్కగా ఉండగానే వంచాలి. ఐ మస్ట్ డూ సమ్‌థింగ్ అన్నాడు ఆలోచిస్తూ. ఆ సంభాషణ తనకి రుచించనట్టు అరవింద లేచి బెడ్‌రూమ్‌లోకి వెళ్ళిపోయింది.

'కల్యాణ్ వీడింక పెద్దవాడయ్యాడు. నా అవసరం ఏముందిరా? నేను ఇండియా వెళ్ళిపోతానురా. నాకిక్కడ ఇంక అసలు బాగోలేదు" కొడుకు నొచ్చుకోకుండా నెమ్మదిగా అంది. కల్యాణ్ తల్లి వంక బాధగా చూశాడు.

"అమ్మా, వాడలా అన్నాడని వెళ్ళిపోతానంటున్నావా. పిల్లాడమ్మా వాడు. అమ్మా నన్ను కాస్త ఆలోచించనీ.. వాడిని దారిన పెట్టడానికి నీ సాయం కావాలమ్మా. ప్లీజ్ కాస్త ఓపిక పట్టమ్మా". ఆవేదనగా అన్నాడు. అన్నపూర్ణ కొడుకు ఆవేదన చూసి కరిగిపోయింది. ఒక్కగానొక్క బిడ్డ, పంచప్రాణాలు వాడిమీదే పెట్టుకుపెంచింది, చిన్నప్పుడే తండ్రి పోతే. వాడి బాధ తనది కాదూ! మనుమడు అంటే ఎవరు? కొడుకు ప్రాణం. కుర్రవెధవ ఏదో అంటే తాను బాధ పడడం ఏమిటి? చప్పున సర్దుకుంది.

"నాకేం కోపం లేదురా. వాడు చేయి జారిపోతాడేమోనని భయంరా. నీవేం చెప్పు, నేను చేస్తాను వాణ్ణి దారిలో పెట్టడానికి" అంది మనఃస్ఫూర్తిగా కొడుకు తల నిమురుతూ.

* * *

"అరేయ్ వెంకట్. నేను కల్యాణ్‌ని...ఐ నీడ్ సమ్ హెల్ప్." న్యూజెర్సీలో ఉన్న మేనత్తకొడుక్కి ఫోన్ చేశాడు కల్యాణ్ ఆఫీసు నుంచి.

"ఏమిటి, ఏమయింది? ఎనీ ప్రాబ్లమ్. మనీ..." ఆరాటంగా అడిగాడు వెంకట్.

"అదేం కాదురా" అంటూ కొడుకు సంగతి చెప్పుకొచ్చాడు. "వాణ్ణి కాస్త సంస్కరించాలిరా. వాడు బొత్తిగా పాడయిపోతున్నాడు. ఏడేళ్ళకే వీడిలా మాట లెక్కలేకుండా తయారయ్యాడు. కాస్త ఓ చిన్న డ్రామా ప్లే చేసి చూద్దామని ఉంది. అమ్మని తీసుకొచ్చి మీ ఇంట్లో వారం పది రోజులు ఉంచుతాను. మరేం ఇబ్బంది ఉండదు గదా?"

"విత్ ప్లెజర్, అత్తయ్య ఎప్పుడూ రమ్మంటే రానే రాదు. ఇలానైనా వస్తే మాకు సంతోషం. తప్పకుండా తీసుకురా". తరువాత కల్యాణ్ తన ప్లాన్ వివరంగా చెప్పాడు. ఇద్దరూ కలసి చర్చించుకున్నారు చాలాసేపు.

* * *

మరో రెండు రోజుల తరువాత డైనింగ్ టేబుల్ దగ్గర, "మామ్మ ఇండియా వెళ్ళిపోతుంది. తెలుసా?" అన్నాడు కల్యాణ్. అరవింద ఆశ్చర్యంగా తెల్లబోతూ చూసింది భర్త వంక. కిరణ్ కూడా కాస్త ఆశ్చర్యంగా చూశాడు.

అరవింద గాబరాగా, "అదేమిటి..." అని ఏదో అడగబోయింది. "మా అమ్మ ఎందుకు వెళ్ళిపోతోందో తెలుసా? " కళ్యాణ్ రెట్టించాడు. కిరణ్ వంక చూశాడు. కిరణ్ గిల్టీగా చూశాడు. "నీ వల్లే. నీవు ఆవిణ్ణి అవమానించావు. పోలీసులకి కంప్లయింట్ చేశావు. గో ఎవే అన్నావుట. అందుకు ఆవిడ వెళ్ళిపోతోంది". కాస్త కఠినంగా అన్నాడు. అరవింద "అదేమిటి" అని ఏదో చెప్పబోయింది. కల్యాణ్ చేత్తో వారించాడు. అతను అరవిందకి కూడా అసలు సంగతి చెప్పదలచుకోలేదు.

"ఇంక నీ ఇష్టం వచ్చినట్లుండు. అన్నం ఎవరూ పెట్టరు. తినమని ఎవరూ బతిమలాడరు. ఎంత అల్లరి చేసినా ఎవరూ అడగరు. నీ ఇష్టం. రోజంతా ఆడుకో. చదవమని అనడానికి ఎవరూ ఉండరు. బట్, స్కూల్లో పరీక్షల్లో మార్కులు సరిగా రాకపోతే మాత్రం నేనూరుకోను. సో, రేపు మా అమ్మ వెళ్ళిపోతుంది. దానికి కారణం నీవు. నిన్ను ఎత్తుకుని పెంచి, పాలు తాగించి, నీ నేపీలు మార్చి, నీకన్నం పెట్టి, నీళ్ళుపోసి, నీకింత చాకిరీ చేసిన ఆమె, నీ ప్రవర్తన వల్ల వెళ్ళిపోతోంది. దీనికి నిన్ను నేను ఎప్పుడూ క్షమించను". ఒక్కొక్క అక్షరం ఒత్తి పలుకుతూ ఇంగ్లీషులో అన్నాడు. డైనింగ్ టేబుల్ దగ్గర నుంచి లేచి వెళ్ళిపోయాడు. కిరణ్ మొహం మాడిపోయింది. గిల్టీగా చూస్తూ

తానూ గదిలోకి వెళ్ళిపోయాడు. అరవింద అత్తగారితో ఏదో చెప్పబోయింది.

"లేదమ్మా, నన్ను వెళ్ళనీ. నాకింక ఉండాలని లేదు" అది ముభావంగా అన్నపూర్ణ. అరవింద కల్యాణ్‌తో వాదించబోయింది. కల్యాణ్ "ఆవిడిష్టం. నేను ఆపదలచుకో లేదు" అన్నాడు. ప్రయాణం ఆదివారం నిర్ణయమైంది. ఆవిడ సామాను సర్దుకుంది. సూట్‌కేసులు కారులో పెట్టాడు కల్యాణ్. "మామ్మ వెడుతోంది. బై కూడా చెప్పవా?" గదిలో కూర్చున్న కిరణ్ దగ్గరికి వచ్చి అన్నాడు కల్యాణ్.

'గెటప్. సే బైబైటు మామ్మా". కఠినంగా అన్నాడు కల్యాణ్. సిగ్గుపడుతున్నట్టుగా నెమ్మదిగా బయటికి వచ్చాడు. అన్నపూర్ణ "వెడుతున్నారా కిరణ్. ఇంక నీకు మామ్మ బెడద ఉండదు" అంది. దగ్గరకు లాక్కుని ముద్దుపెట్టింది. కిరణ్ మొహం నల్లబడింది. మొహం తిప్పుకుని బై బై అన్నాడు. "వెళ్ళు, నీవూ వెళ్ళు ఎయిర్‌పోర్టుకి" అంది అరవింద.

"అవసరం లేదు. ప్రేమ, అభిమానం ఉన్నవారు వెడతారు ఎయిర్‌పోర్టుకి. వీడికి ఆవిడ మీద ప్రేమ లేదుగా. రానవసరం లేదు" అంటూనే కారు పోనిచ్చాడు. కిరణ్‌మొహం ఆ మాటలకి మరింత నల్లబడింది. కోపంగా కారు వంక చూసి లోపలికి వెళ్ళిపోయాడు భుజాలెగరేస్తూ.

* * *

అన్నపూర్ణ వెళ్ళిపోయి వారం అయింది. అరవింద అలవాటు లేని పనితో అపసోపాలు పడుతూ ఆ కోపం, విసుగు కిరణ్‌మీద చూపింది. "చూడు, మామ్మ కోపం వచ్చి వెళ్ళిపోయింది. నీవల్లే ఇదంతా" అని రెండు మూడుసార్లు కిరణ్‌ని దెప్పింది. "మామ్మ లేదు. నిన్ను ఇంట్లో ఒంటరిగా వదిలి వెళ్ళాల్సివస్తోంది. ఎప్పుడేం చేస్తావోనని భయం." విసుక్కుంది. "మరీ వెధవ అల్లరి చేసి ఆవిణ్ణి కాల్చుకు తిన్నావు. ఇప్పుడు చూడు ఎంత ఇబ్బందో" అంది.

కిరణ్‌కి రెండు మూడు రోజులు హాయిగా, ఒంటరిగా స్వేచ్ఛగా ఇంట్లో ఒక్కడూ ఉండడం బాగుందనిపించింది. రెండు రోజులు ఇష్టం వచ్చినవి ఫ్రిజ్‌లోంచి తీసుకుని తిన్నాడు. కావలసినన్ని కోక్‌లు, ఐస్‌క్రీములు, చాక్‌లెట్లు ఇష్టం వచ్చినప్పుడు తిన్నాడు. టీవీ టకటకా చానల్స్ మారుస్తూ చూశాడు. కంప్యూటర్ గేమ్స్ ఆడాడు. కామిక్‌లు ఇల్లంతా పరిచేసి, బొమ్మలు పరిచేసి ఆడాడు. ఇది తిను, తాగు, చదువు అనేవారు లేకుండా తల్లీతండ్రీ ఆఫీసు నుంచి వచ్చేవరకు ఇష్టారాజ్యం ఏలాడు. తల్లి స్పేర్ కీ ఇచ్చి తీసుకోవలసిన జాగ్రత్తలు చెప్పి, ఫ్రిజ్‌లో తీసుకుని మైక్రోవోవెన్‌లో వేడిచేసుకునే విధం అదీ చెప్పి, ఇల్లు తలుపు తెరిచి బయటికి రావద్దని రకరకాల జాగ్రత్తలు చెప్పింది.

కల్యాణ్ అయితే కొడుకుతో మాట్లాడకుండా ముభావంగా ఉన్నాడు.

రెండు మూడు రోజుల స్వేచ్ఛ తరువాత కిరణ్‌కి బోర్ కొట్టడం ఆరంభించింది.

ఇంట్లో మాట్లాడేందుకు ఎవరూ లేక ఏదో ఒంటరితనంతో దిగులు ఆరంభించింది. మామ్మ ఉంటే కథలు చెప్పేది. పాపం తినరా, తాగరా అంటూ వేధించేది. తాను విసిరేసిన బట్టలు, బూట్లు, పుస్తకాలు సర్దుతూనే ఉండేది. ఇప్పుడెక్కడివక్కడ పడేస్తే అమ్మ ఇంటికి రాగానే తిడుతోంది. అలా ఇల్లంతా సామాను పడేసి ఉంటే తనకే ఇబ్బందిగా ఉందనిపించింది.

బొమ్మలు, పుస్తకాలు సర్దాడు. టీవీ చూడబుద్ధికాలేదు. దిగులుగా, ఒంటరిగా కూర్చున్నాడు. మామ్మ లేకపోతే ఇంట్లో బాగోలేదు అనిపించింది.

"మమ్మీ... మామ్మ ఇంక రాదా ఇక్కడికి?" ఆ రాత్రి నెమ్మదిగా తల్లినడిగాడు వంటింట్లో ఉండగా.

"వెళ్ళిపోయిందిగా ఆవిడ. మళ్ళీ అంతదూరం నుంచి ఎందుకొస్తుంది? ఎప్పుడైనా మనమే వెళ్ళి చూడాలి ఇంక" అంది మామూలుగా.

ఆ మాట రుచించలేదు. తండ్రినడిగితే? కల్యాణ్ వారం రోజుల నుంచి అసలు కొడుకుతో మాట్లాడడం లేద. తండ్రి దగ్గరకి వెడితే నీవల్లే వెళ్లిపోయింది. అంటాడు. ఇంట్లో తండ్రి మాట్లాడడం లేదు. తల్లి ఆఫీసునుంచి వచ్చి వంట పనిలో ఉంటుంది. ఉదయం వాళ్ళకి ఆఫీసుకెళ్ళే హడావిడి. స్కూలు టైమ్ తప్ప అసలు బాగోలేదు. కిరణ్‌కి ఇంట్లో. పుట్టినప్పటినుంచి ఉన్న మామ్మ లేకపోవడం చాలా వెలితిగా అనిపించింది.

* * *

ఆ రోజు ఆదివారం. ఉదయం పది గంటల వేళ వారం రోజుల తర్వాత కల్యాణ్ అలవాటుగా ఆదివారం ఆదివారం తెచ్చుకునే గ్రోసరీస్, కూరలు, పళ్ళు తెచ్చుకునే 'మాల్'కి వెళ్ళడం కోసం కారు తీశాడు.

ప్రతిసారీ కిరణ్ కూడా వెడతాడు. కారు తీయడం చూసి కిరణ్ కారు దగ్గరకి వచ్చి నిలుచున్నాడు. కల్యాణ్ ఏం మాట్లాడలేదు. కిరణ్ కారెక్కాక కారు పోనిచ్చాడు.

కారు మామూలుగా వెళ్తే రోడ్డులో కాక ఎక్కడికో వెళ్తుండడం చూసి, "డాడీ మనం ఎక్కడికి వెళ్తున్నాం?" అన్నాడు ఆశ్చర్యంగా.

కల్యాణ్ మాట్లాడలేదు.

ఓ అరగంట డ్రైవ్ తరువాత ఓ పెద్ద గేట్లోంచి కారు వెళ్ళి ఆగింది.

"దిగు అన్నాడు. అదొక ఓల్డ్ ఏజ్ హోమ్. దాన్నిండా పండు ముసలి స్త్రీలు, పురుషులు. "ఇదేమిటో తెలుసా? ఓల్డ్ పీపుల్- ఎవరూ లేని వారు, ఉన్నా పిల్లలు చూడకుండా వదిలేసిన వారు, ఇళ్ళల్లో చోటు లేదని, చూసేవారు లేరని పేరెంట్స్‌ని ముసలివాళ్ళయ్యాక ఇలాంటి ఓల్డ్ ఏజ్ హోమ్‌లో చేరుస్తారు".

అక్కడ ఆఫీసులో మాట్లాడాక మొత్తం గదులు, వరండాలు అన్నీ తిరుగుతూ చూపసాగాడు. చాలా ముసలివారు. కొంతమంది పడుకుని, కొందరు పేపరు, పుస్తకాలు చదువుతూ, కొంతమంది కబుర్లు, కొంతమంది ఏవో గేములు ఆడుతూ, కర్ర సాయంతో, వాకర్ సాయంతో నడిచే రకరకాల ముసలివారిని చూశారు.

"నిన్ను ఇక్కడికెందుకు తీసుకొచ్చానో తెలుసా? మామ్మ మన దగ్గర నుంచి వెళ్ళిపోయింది. ఇండియాలో ఇలాంటి ఓల్డ్ ఏజ్ హోమ్‌లో చేరతానంది ఆవిడ. అక్కడ పాపం తనకింకెవరూ లేరుగా" అన్నాడు.

కిరణ్ మొహం పాలిపోయింది. "వై, మామ్మ ఈజ్ నాట్ ఓల్డ్" అన్నాడు.

"ఇంత ముసలి అవలేదనుకో ఇంకా. కానీ, కొన్నాళ్ళు పోతే అవుతుంది. అక్కడ తనకేదన్నా వంట్లో బాగోలేకపోతే ఎవరు చూస్తారు? ఒక్కర్తి ఇంట్లో సాయం లేకుండా ఎలా ఉంటుంది. అంచేత కాలక్షేపం ఉంటుంది. ఏదన్నా అయినా చూసే వారుంటారు అని చేరతానంది. కిరణ్ నీ వల్లే మామ్మ వెళ్ళిపోయింది. నీ వల్లే ఇలా మనం ఉన్నా కూడా ఓల్డ్ ఏజ్ హోమ్‌లో చేరుతోంది. అంతా నీ వల్లే. నాకందుకే నీమీద కోపంగా ఉంది. మా అమ్మని దూరం చేసుకున్నాను" బాధగా అన్నాడు కాల్యాణ్?

కిరణ్ 'డాడీ' అంటూ ఒక్కసారిగా ఏడుస్తూ తండ్రిని కౌగలించుకున్నాడు.

"డాడీ...మామ్మని పిలు డాడీ... డాడీ మామ్మని తీసుకురా. మామ్మకి ఫోన్ చెయ్యి" బెక్కుతూ తండ్రిని మరింత గట్టిగా వాటేసుకుని మొహం దాచుకుని ఏడుస్తూ అన్నాడు.

కల్యాణ్ ఆశ్చర్యపోయాడు. ఒక్కసారిగా ఇలాంటి రియాక్షన్. ఇలా ఏడుస్తాడని అతను ఎదురు చూడలేదు. కొడుకు ఏడుపు మానిపించి, కళ్ళు తుడిచి, "ఏడవకు" అంటూ చాలా సేపు లాలించాక గానీ ఏడుపు ఆపలేదు కిరణ్. కారులో కూర్చోపెట్టి, "నిజంగా అంటున్నావా" అన్నాడు.

"ఎస్. ఐ వాంట్ మామ్మ. మామ్మని ఓల్డ్ ఏజ్ హోమ్‌కి వెళ్ళవద్దని ఫోన్ చెయ్యి. ఇక్కడికి వచ్చేయమను" ఏడుపు గొంతుతో అన్నాడు.

"ఓ.కే. ఓకే ఏడవకు. ఫోన్‌చేసి చూస్తా, కానీ. ఏముంటుందో, రాదేమో".

"ఎందుకు రాదు. నేను ఫోన్ చేస్తే వస్తుంది" అన్నాడు.

తీరా వచ్చాక సరిగా ఉంటావా మరి? ఆవిడ మాట వింటూ బుద్ధిగా ఉండాలి". కిరణ్ కళ్ళు వాల్చుకుని తల ఆడించాడు.

"సరే. ఇంటికెళ్ళాక ఫోన్ చేస్తాను."

"వద్దు. ఇప్పుడే చేద్దాం. ఇక్కడి నించే నేను మాట్లాడుతా." మారాం చేశాడు. దగ్గరలో కనబపడ్డ టెలిఫోన్ బూత్ చూపిస్తూ.

కల్యాణ్‌కి అదీ మంచిదనిపించింది. తానెక్కడికి రింగ్ చేస్తున్నదీ తెలియదనిపించి డయల్ చేశాడు. "అమ్మా, కిరణ్ నీతో మాట్లాడతాడట" అంటూ ఫోన్ అందించాడు.

"మామ్మా!" కిరణ్ అరిచినట్లే పిలిచి, "మామ్మా నీవు లేకపోతే నాకేం బాగోలేదు. ఐమిస్‌యూ మామ్మా. ఐ లవ్ యూ మామ్మా. నీవు ఓల్డ్ ఏజ్ హోమ్‌లో చేరొద్దు. వెంటనే నీవిక్కడికి రావాలి. వచ్చేయ్"పట్టుకున్న గొంతుతో చాలా ఎమోషనల్‌గా అన్నాడు.

"అమ్మా. కిరణ్ నిన్ను చాలా మిస్ అవుతున్నాడు వెంటనే రా అమ్మా.... లేదు, ఇంక సరిగ్గా బుద్ధిగా ఉంటానంటున్నాడు. ప్రామిస్ చేశాడు. టికెట్ కొని చెప్పమ్మా ఎప్పుడొచ్చేది' అంటూ ఫోన్ పెట్టేశాడు.

* * *

"మామ్మా!" అంటూ అన్నపూర్ణ రాగానే చుట్టేశాడు కిరణ్.

మామ్మా అన్న పిలుపులోని ఆర్తిని, మమతని, ఆ కౌగిలింతలోని ఆత్మీయతని చూసి రక్తసంబంధపు ఆ స్పర్శ చూడగానే కల్యాణ్‌కి-చచ్చిపోయిందనుకున్న చిన్న మొక్క చిగురించి రెండు మారాకులు తొడిగినప్పుడు కలిగే ఆనందం, ఆగిపోయిన గుండె లబ్‌డబ్ అనగానే ఓ డాక్టర్‌కు కలిగే అనుభూతి కలిగింది. ఫరవాలేదు, వీడిలో ఇంకా అనుభూతులు మిగిలి ఉన్నాయి అనిపించి ఆనందాన్నిచ్చింది ఆ దృశ్యం.

"మామ్మా, నీవింకెప్పుడూ వెళ్ళద్దు. నిన్ను వెళ్ళనీయను. నీవిక్కడే ఉండాలి" అంటున్న మనుమడిని హత్తుకుని ముద్దులు కురిపించింది అన్నపూర్ణ.

"వెర్రి వెధవ. దుడుకుతనం తప్ప అభిమానం లేకుండా ఎలా పోతుంది. మూడో నెల నుంచి ఒళ్ళో పెట్టుకుని పెంచాను. రక్తసంబంధం ఎలా పోతుంది?" అంది కొడుకుతో.

"కిరణ్! తాత, నాయనమ్మల లాంటి పెద్దవారు ఇంట్లో ఉండడం మనకు వరంరా.

ఇంట్లో పెద్దవాళ్ళుంటే ఎంత భరోసా, నిశ్చింత. పెద్ద దిక్కు ఒకరుంటే ఎంత నిండుతనం ఇంటికి. ఈ పది రోజులు నిన్ను ఒంటరిగా వదలడానికి ఎంత భయపడ్డాం. కిరణ్! మామ్మలని, తాతలని ఓల్డ్ ఏజ్ హోమ్స్‌కి పంపే సంస్కృతి మనకొద్దురా మన ఇండియన్స్ సెంటిమెంట్లే మన కుటుంబ వ్యవస్థని కాపాడుతోంది. తాత, నాయనమ్మలు మనుమళ్ళ మీద పెంచుకునే ప్రేమ ఎంతో గొప్పది. అలాంటి ప్రేమను పంచి ఇచ్చే గ్రాండ్స్ పేరెంట్స్‌ని మీ తరం పిల్లలు గౌరవించాలి. మేం ఉన్నాం మీకు అన్న బరోసా పేరెంట్స్‌కి ఇవ్వాలి పిల్లలు. పెంచి పెద్ద చేసి చదివించి, మనల్ని ఇంత కష్టపడి పైకి తెచ్చినవారిని నిస్సహాయ స్థితిలో ఉండగా వదిలేయడం మానవత్వం కాదు. పెద్దవాళ్ళని గౌరవించే సంస్కృతి మనది. అది మనం ఏ దేశంలో ఉన్నాపాటించాలి. ఇక్కడ ముసలివారికి పడుతున్న దుర్గతి మనవాళ్ళకి పట్టకుండా చూడాలి మీ తరం. అభిమానం, అనురాగం, ఆప్యాయతలు లేకపోతే మనుషుల సంబంధాలు నిలువవు. మామ్మకి మనం తప్ప ఎవరున్నారు. ఆవిడని ప్రేమగా చూడాల్సిన బాధ్యత మనది. అదెప్పుడూ మర్చిపోకూడదు.

కల్యాణ్ మాటలు ఏం అర్థమయ్యేయో గానీ, మామ్మ చేతిని పట్టుకు లాగుతూ గదిలోకి తీసుకెళ్ళాడు కిరణ్.

◆ ఇండియా టుడే, 29 జులై-2003